# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం ‘కౌముది‘ పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృథాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*

\- మల్లాది

The conscious mind is the editor, and the unconscious mind is the writer.

*- David Mamet*

# 2

## నాకు తెలిసిన వేటూరి



మే 21, 2010 రాత్రి పడుకోబోయే ముందు టి.వీలో న్యూస్ ఛానల్ చూస్తే వేటూరిగారి మరణ వార్త తెలిసింది. వెంటనే నాకు వారితో ఉన్న పరిచయం గుర్తొచ్చింది.

1978లో అనుకుంటూ ఓ సారి హైదరాబాద్‌లో, రాంనగర్ లోని రామయ్య మెస్‌లో భోజనం చేస్తున్నప్పుడు 'ఆరేసుకోబోయి' అనే పాటని విన్నాను. అది శ్రీ వేటూరి సుందర రామ్మూర్తి రాసిన పాట అని ఓ మిత్రుడు చెప్పాడు. ఆ తర్వాత మ్యూజిక్ డైరెక్టర్ చక్రవర్తి, వేటూరి పాటలని ఆ నాటి యువతరంలోని నేను కూడా ఫాలో అయేవాడిని.

నేను శ్రీ వేటూరిని మొదటిసారి 1982లో మద్రాస్‌లోని ప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ఆఫీస్‌లో చూసాను. శ్రీ ప్రత్యగాత్మ దర్శకులు గా పి.ఏ.పి వారు రూపొందించే ఓ లవ్ స్టోరీకి నా చేత మాటలు రాయించారు. శ్రీ మోహన్ గాంధీ (తర్వాత దర్శకులయ్యారు) దానికి కో డైరెక్టర్. ఇప్పటి విలన్ అయిన శ్రీ బెనర్జీ దానికి అసిస్టెంట్ డైరెక్టర్.

ముందు రోజే నేను రాసిన సంభాషణలని శ్రీ మోహన్ గాంధీ, సుందరరామ్మూర్తిగారికి అందచేసారు. మర్నాడు ఆయన పి.ఏ.పి ఆఫీస్‌కి వచ్చి ఓ పాట రాస్తే, ఆ మర్నాడే ట్యూన్ పుట్టాల్సి ఉంది. ఆయన మధ్యాహ్నం పన్నెండున్నరకి మరో చోట పాట రాసి స్క్రిప్ట్ ఫైల్‌తో వచ్చారు. ఆయన్ని చూడాలనే కుతూహలంతో నేను వారి కోసం ఆత్రంగా ఎదురు చూసాను. చెప్పిన టైంకి అరగంట ఆలస్యంగా వచ్చారాయన. శ్రీ ప్రత్యగాత్మ భోజనానికి ఇంటికి వెళ్ళకుండా వారికోసం ఆగిపోయారు.

ఆయన ఫోటోలు పూర్వం చాలాసార్లు చూసాను. కాబట్టి రాగానే ఆయన్ని గుర్తుపట్టాను. పి.ఏ.పి వారి ఫస్ట్ ఫ్లోర్‌లో ప్రత్యగాత్మ గారికి ఓ ఏ.సి గది ఉండేది. అంతా ఆయన ఆ గదిలోకి వస్తారని ఎదురు చూసాం. కానీ ఆయన టెర్రస్ మీద ఉన్న చిన్న అరుగు మీద కూర్చున్నారని ఆఫీస్ బోయ్ వచ్చి చెప్పగానే అంతా అక్కడికి వెళ్ళాం. ప్రత్యగాత్మగారు ఏ సన్నివేశంలో పాటకావాలో వివరించారు. 'దీనికి సంభాషణలు రాసిందెవరు?' అడిగారాయన. శ్రీ ప్రత్యగాత్మ నన్ను శ్రీ వేటూరికి పరిచయం చేసారు. 'బావుంది బాగోలేదు' అనే కామెంట్ కోసం ఎదురు చూసాను కాని ఆయన మౌనంగానే ఉన్నారు. రచయితగా నన్ను గుర్తించిన దాఖలాలు ఏవీ ఆయనలో నాకు కనపడలేదు. అసోసియేట్ డైరెక్టర్ శ్రీ షిండే పాడ్ పెన్ను ఆయనకు ఇవ్వగానే కంఠతా పట్టిన విద్యార్థి జవాబు రాసినంత సులువుగా ఆయన కలంలోంచి పాట కాగితం మీదకి జాలువారింది.

'మల్లెపూల మారాణికి బంతిపూల పారాణి.. సన్నజాజి ముంగిళ్ళలోనా గున్నమావి పందిళ్ళలోనా కోకిలమ్మ పాట కచేరి!'

హీరోయిన్ హీరోని ఊహించుకుంటూ పాడే ఓ సన్నివేశంలోని ఆ పాటని నాలుగైదు నిమిషాల్లో రాసేసారు. అచ్చ తెలుగు మాటలతో ఆయన గురువు గారు మల్లాది రామకృష్ణ శాస్త్రి స్థాయిలో రాసిన ఆ పాటకి ప్రత్యగాత్మగారు ఎలాంటి కరక్షన్సు కోరలేదు. ఆయన్ని మాతోపాటు భోజనం చేయమని కోరినా వద్దని వెళ్ళిపోయారు. పారితోషకం కూడా ఆయనకి వెంటనే ఇవ్వలేదు. ఇదంతా చూసి నాకు ఆశ్చర్యమేసింది. శ్రీ ఆత్రేయ ఓ పాటని రాయడానికి చాలారోజులు తీసుకుంటారని, ఫైవ్ స్టార్ హోటల్‌లో మకాం చేస్తే కాని పాట రాదని విని ఉన్నాను. శ్రీ వేటూరి ఇవేం లేకుండా అలఓకగా పాటని రాయడంతో ఆయన సరస్వతీ పుత్రులని నాకు అర్థమైంది.

మర్నాడు విజయగార్డెన్స్‌లో ఆ పాట ట్యూన్ కట్టడానికి చక్రవర్తిగారి దగ్గరకి అంతా వెళ్ళాము. శ్రీ వేటూరి అక్కడే ఉన్నారు. మోహన్ గాంధీ నన్ను పరిచయం చేయగానే శ్రీ చక్రవర్తి రచయితగా నన్ను గుర్తు పట్టి చాలా ఆప్యాయంగా మాట్లాడారు. ఆ తర్వాత మా స్నేహం ఆయన పోయేదాకా కొనసాగింది. శ్రీ వేటూరి మాత్రం మౌనంగానే ఉన్నారు.

ఆ పాట రికార్డింగ్ అయి మరోవారంలో వైజాగ్‌కి యూనిట్ అంతా అవుట్ డోర్‌కి వెళ్ళాల్సి ఉంది. అంతా కొత్తవాళ్ళతో తీసే ఆ చిత్రంలో ఓ అమ్మాయిని హీరో చెల్లెలుగా బుక్ చేసారు. ఆమె పేరే భానుప్రియ. కానీ నిర్మాత సుబ్బారావుగారు హైదాబాద్ వెళ్ళి తిరిగి రాగానే ప్రత్యగాత్మ గారిని తన గదిలోకి పిలిచారు. నిముషం కూడా కాకుండానే ఆయన బయటకి వచ్చి ఫైల్ గిరాటేసి 'నేను వెళుతున్నాను. ఇక పి.ఏ.పి కి నాకు సంబంధం తీరిపోయింది' అని కోపంగా కారెక్కి వెళ్ళిపోయారు. సుబ్బారావుగారికి హైదరాబాదులో ఎవరో కొత్తవాళ్ళతో తీసే ఆ సినిమా ఆడదని గట్టి సలహా ఇవ్వబట్టి ఆయన దాన్ని విరమించుకున్నారు. అదే రాత్రి నేను హైదరాబాద్ తిరిగి వచ్చేసాను. తర్వాత ఆ పాట శ్రీ జంధ్యాల తీసిన 'అమరజీవి' సినిమాలో పి.ఏ.పి నుంచి కొని వాడారు. శ్రీ చక్రవర్తి, జంధ్యాలకి ఆ పాట గురించి చెప్పారు.

ఒకటి రెండుసార్లు శ్రీ వేటూరి మళ్ళీ నాకు విజయా గార్డెన్స్‌లో చెట్టుకింద కూర్చుని పాటలు రాస్తూ కనిపించారు. ఆయన్ని విష్ చేస్తే నన్ను గుర్తుపట్టారు కానీ ముభావంగానే ఉన్నారు.

1984 లో నేను రాసిన 'పెద్దలకి మాత్రమే' నవలని రవికళామందిర్ బేనర్ లో నిర్మాత శ్రీ ఎం.ఎస్.ప్రసాద్, జంధ్యాల దర్శకత్వంలో సినిమా తీసారు. ఆ సమయంలో జంధ్యాల, వేటూరిల మధ్య మాటలు లేవు. ఎం.ఎస్.ప్రసాద్ శ్రీ వేటూరితోనే రాయించాలని పటుబట్టి వారిద్దరికీ తనే సయోధ్యని కుదిర్చారు. పాటల సన్నివేశాలు జంధ్యాలగారూ, నేనూ ముందే నిర్ణయించుకున్నాం. కాబట్టి నేను ఓ పాట సిట్యుయేషన్‌ని శ్రీ వేటూరికి చెప్పాను. అంతకు మునుపే శ్రీ జంధ్యాల 'మగ యద్దనపూడి సులోచనారాణి. యద్దనపూడిలా ఈయనా పాపులర్ రైటర్' అని వారికి పరిచయం చేస్తే 'నాకెందుకు తెలియదు?' అన్నారు. మైధునం మీద ఇంగ్లీష్‌లో ఓ పోయంని వారికి చెప్పి, తెలుగు టైటిల్ సాంగ్ అలా ఉంటే బాగుంటుందని సూచించాను.

ఐ సెడ్ ఒన్
షి సెడ్ బిగిన్
ఐ సెడ్ టు
షి సెడ్ డూ
ఐ సెడ్ త్రీ
షి సెడ్ ఫ్రీ
ఐ సెడ్ ఫోర్
షి సెడ్ పోర్
ఐ సెడ్ ఫైవ్
షి సెడ్ హైవ్
ఐ సెడ్ సిక్స్
షి సెడ్ ఫిక్స్
ఐ సెడ్ సెవెన్
షి సెడ్ హెవెన్
ఐ సెడ్ ఎయిట్
షి సెడ్ టైట్

ఐ సెడ్ నైన్

షి సెడ్ ఫైన్

ఐ సెడ్ టెన్

షి సెడ్ డన్

తర్వాత శ్రీ జంధ్యాల ఇచ్చిన శ్రీవారి శోభనం పాటల కేసెట్‌ని విన్నాను. దాన్ని ఇలా రాసారు.

*'ఒకటి ఒకటి ఒకటీ కానీ మసక చీకటి*

*రెండూ రెండూ రెండూ వేయి పక్క దిండూ*

*మూడూ మూడూ మూడూ రానీ ముద్దుకి మూడు..* ' ఇలా సాగుతుందా పాట.

నేను కవిత్వపు ధోరణి టైటిల్ కోసం ఆలోచిస్తుండగా ఓసారి ఈపాటలోని ఆయన రాసిన పదం 'జాబిలి మీద సంతకం' గుర్తొచ్చి అదే టైటిల్‌గా ఓ నవలకి పెట్టాను. నా నవల మిస్టర్ వి ఆధారంగా సత్యానంద్ దర్శకత్వంలో వచ్చిన ఝాన్సీరాణిలో ఆయన రాసిన మరోపాటలోని 'రేపో మాపో పెళ్ళంట, ముద్దుకి మూడే ముళ్ళంట' అనే రెండు పదాలని నా మరో రెండు నవలలకి టైటిల్స్‌గా వాడాను. నేను రాసిన మరో నవల పేరు 'నీకూ నాకూ పెళ్ళంట' కూడా ఈ పాటలోని ఓ పదమే.

ఆ తర్వాత ఓ సారి ఆయన నాకు ఫోను చేసి ఆయన పేరు మీద వచ్చే సావెనీర్ కి వ్యాసం రాసివ్వమని కోరారు. దాన్ని ఎవరో ఆయన తరపున వచ్చి తీసుకువెళ్ళారు. ఆ సావనీర్ కాపీని శ్రీ వేటూరి తర్వాత నాకు పంపారు.

జంధ్యాలగారు తీసిన ఆఖరి సినిమా 'విచిత్రం'కి ఆధారం నవల 'రేపో మాపో పెళ్ళంట'. ఆ సందర్భంగా హైదరాబాద్ లోని గోల్కొండ హోటల్‌లో పాటల సెషన్ అప్పుడు వారిని కలిసాను. నేను వారి పాటల్లోని పదాలని నా నవలలకి ఎలా వాడుకున్నానో చెప్పాను. మౌనమే జవాబు.

నేను వారిని ఆఖరిసారి చూడటం నారాయణ గూడా తాజ్ మహల్ హోటల్లోని రెస్టారెంట్ విభాగంలో. అక్కడ ఆయన ఉప్మా తింటున్నారు. ఆయన తరచూ అక్కడికి వచ్చి ఉప్మా తింటారని తర్వాత తెలిసింది. నేను రాసిన 'గుట్టు' అనే రొమాంటిక్ కథలోని స్టాక్ కేరక్టర్ భువనేశ్వరి తన కొలీగ్స్ యొక్క సెక్స్‌కి సంబంధించిన సమస్యలని పరిష్కరించాక, నారాయణ కూడా తాజ్ లో ఉప్మా తినిపించమని అడుగుతుంది. శ్రీ వేటూరే దీనికి పరోక్షంగా కారణం.

గీతాంజలి వందరోజుల సెలబ్రేషన్ మద్రాస్‌లో చోళ షెరటన్‌లో జరిగింది. ఆ ముందు రోజు రాత్రి నేను మద్రాస్ వెళ్ళే ఫ్లయిట్ లో శ్రీ వేటూరి కూడా ఉన్నారు కాని నేను చాలా వెనకగా కూర్చోవడంతో ఆయనతో మాట్లాడలేకపోయాను.

ఓసారి మోహన్ గాంధీగారు అనుకుంటా చెప్పారు. శ్రీ వేటూరిలోని ఓ వింత మనస్థత్వం. - ఆయన మద్రాస్ లోని ఫైవ్ స్టార్ హోటల్స్‌లోని బార్లకి నిర్మాతలతో వెళ్ళినప్పుడు ఓ పెగ్ తాగి 'వాడు నన్నే చూస్తున్నాడు. వెళ్ళిపోదాం' అని ఇంకో బార్‌కి వెళ్ళాక అక్కడా ఓ పెగ్ తాగి అదేమాట చెప్పి ఇంకో బార్ కి వెళ్ళేవారట. రోజూ ఇదే తంతు. తర్వాత ఆయన ఆల్కాహాల్‌ని పూర్తిగా మానేసారు. ఓసారి వారితో కల్సి నేను ఆల్కాహాల్ తీసుకున్నాను. "సూర్యభగవానుడు ఉండగా నాకు దిగదు" అన్నారు. ఓ అరగంట వేచి ఉండి, చీకటిపడ్డాక మొదలుపెట్టాం.

శ్రీ తనికెళ్ళ భరణి నాలుగైదేళ్ళ క్రితం చెప్పారు, తను వేటూరి కలిసి నర్సరావు పేట దగ్గరున్న ఓ ప్రాచీన శివాలయానికి వెళ్ళామని, వేటూరి గారు శివభక్తుడుగా మారారని ఆయన ద్వారా తెలిసింది.

ఇటీవల టి.వీలోని పాటల కార్యక్రమంలో జడ్జిగా వచ్చిన ఆయన్ని చూసినపుడు అనిపిస్తుండేది, ఆయనతో స్నేహం కుదిరివుంటే బావుండేది అని. ఆయనంత సౌమ్యుడిని జీవితంలో తక్కువసార్లు చూస్తాం.

వారి ఆత్మకి శాంతి కలిగించాలని పరమ శివుడిని వేడుకుంటున్నాను.

*(వచ్చే నెలలో మరికొన్ని విశేషాలు)*

✡ ✡ ✡